క్లుప్తంగా

ప్రభుత్వవిప్‌కు సన్మానం



సన్మానిస్తున్న జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులు

వేములవాడ: రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులైన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం ముఖ్య నాయకులు వేములవాడలోని తన నివాసంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. త్వరలో జరిగే జగిత్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానపత్రిక అందించారు. బీసీ సంఘాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాదినేని రాజేందర్, జిల్లా ముకాస అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి మల్లారెడ్డి, కోశాధికారి కుంట సుధాకర్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, సహాయ కార్యదర్శి జక్కుల లింగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రంగు గోపాల్, సత్తయ్య, నర్సారెడ్డి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

తంగళ్లపల్లి: గురుకులాల్లో చేపడుతున్న ఉపాధ్యాయ నియామకాల్లో డౌన్ మెరిట్ లిస్ట్ ద్వారా భర్తీ పూర్తిచేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గురుకుల మెరిట్ అభ్యర్థులు వినతిపత్రం అందించారు. గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడంతో ఎంతో మంది అభ్యర్థులకు ఒకటికంటే ఎక్కువ ఉద్యోగాలు సాధించారని, దీంతో మిగతా అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. గురుకుల మెరిట్ అభ్యర్థులు సీహెచ్.మనోహర్, పర్శరాములు, శ్యామల, నరేందర్, ఎం.సాయికృష్ణ, కె.కృష్ణ తదితరులున్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ సంబరాలు

వేములవాడ: నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి అభివృద్ధి పేరిట అసత్యపు ప్రచారాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందులు, నాయకులు వెంగళ శ్రీకాంత్‌గౌడ్, ఈర్లపల్లి రాజు మాట్లాడుతూ బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులు రాజన్న ఆలయానికి కేటాయించామని చెప్తూ రోజులు గడుపుతున్నారే తప్ప అభివృద్ధి శూన్యమేనన్నారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కౌన్సిలర్ కుమ్మరి శ్రీనివాస్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు చేనేత కార్మికులకు సన్మానం



సిరిసిల్ల అర్బన్: చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ చేనేత జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ చేనేత జిల్లా అధ్యక్షుడు గోనే ఎల్లప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం నేతన్న విగ్రహానికి పూలమాలవేసి అనంతరం రాజీవ్‌నగర్‌లోని మహేశ్వర చేనేత సంఘంలో సమావేశం ఏర్పాటు చేసి చేనేత కార్మికులను సత్కరించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కుడికాల రవి కుమార్, సాగర్, అన్నల్‌దాసు భాను, రాజు, బచ్చు ప్రసాద్, పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ

వేములవాడ: పట్టణంలో తిరుగుతున్న స్కూల్ వ్యాన్లలో సామర్థ్యాన్ని మించి విద్యార్థులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. అధికలోడ్‌తో వెళ్తున్న టాటా ఏసీలు, ఆటోలను సైతం పరిశీలించారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దుంపెన రమేశ్

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేశ్ మొక్కలు పంపిణీ చేశారు. జామ, నిమ్మ, దానిమ్మ, మందార, పారిజాతం తదితర 560 వరకు మొక్కలు అందించారు.

పుష్పగుచ్ఛం అందజేత

గంభీరావుపేట: లంబాడా హక్కుల పోరాట సమితి ఫౌండర్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను జిల్లా లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నాయకులు బానోత్ గోపి నాయక్, అజ్మీర భాస్కర్, తదితరులున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

వీర్నపల్లి: మండలకేంద్రానికి చెందిన దాసారం శంకర్ మంగళవారం రాత్రి తన వ్యవసాయం పొలం వద్దకు వెళుతుండగా వీర్నపల్లి ప్రధాన రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలుకాగా శంకర్‌ను 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ముస్తాబాద్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విశ్వకర్మలు



వేములవాడ రూరల్: వేమలవాడ డిగ్రీ కళాశాలలో..

జయశంకర్ ఆశయ సాధనకు కృషిచేయాలి



వేములవాడ: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, రాజన్న ఆలయ అధికారులు

సిరిసిల్ల టౌన్/ వేములవాడ/ వేములావాడ అర్బన్/ వేములవాడ రూరల్/ముస్తాబాద్/సిరిసిల్ల కల్చరల్/సిరిసిల్ల క్రైం/ ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/ తంగళ్లపలి/చందుర్తి/ గంభీరావుపేట/ కోనరావుపేట/వీర్నపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జయశంకర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందకళ చిత్రపటానికి నివాళి అర్పించారు. వేములవాడ రాజన్న ఆలయంలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో, వేములవాడ తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, ముస్తాబాద్ సెస్ కార్యాలయం, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో, ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని జూనియర్ కళాశాల, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, బోయినపల్లి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం, మండల విశ్వబ్రాహ్మణ ఐక్యసంఘం ఆధ్వర్యంలో, తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఆ ధ్వర్యంలో, చందుర్తి మండలకేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఆధ్వర్యంలో, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో, వేములవాడ మండలం హన్మాజిపేటతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మండల పరిషత్ ఆవరణలో కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి ప్రభుత్వ ఉన్న పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌తోనే వస్త్ర పరిశ్రమ అభివృద్ధి



మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ నాయకులు రాజకీయ ఉనికి కోసమే కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల ఇన్‌చార్జి కళ్లు ఉండి చూడలేని వ్యక్తిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌తోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, నేతన్నల అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని మరువొద్దన్నారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జెడ్పీ మాజీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, దార్నం లక్ష్మీనారాయణ, కుంభాల మల్లారెడ్డి, రాఘవరెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రైతునేస్తం సద్వినియోగం చేసుకోవాలి

బోయినపల్లి: రైతులు రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. కొదురుపాక రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నిమ్మ, బత్తాయి తోటల్లో తెగుళ్ల నివారణ గురించి ఉద్యాన పరిశోధన కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త సీహెచ్.రాజాగౌడ్, సోయాబీన్ పంటల చీడపీడలపై ప్రాంతీయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ శాస్త్రవేత్త ఎం. రాజేందర్‌రెడ్డి వివరించారు. ఎంఏవో కె.ప్రణీత, ఏఈవోలు శ్రీదేవి, రవళి, సాహితీ, అనూష, రైతులు పాల్గొన్నారు. అంతకు ముందు డీఏవో నర్సింగాపూర్ పీఏసీఎస్‌ను సందర్శించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ధర్మారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

కోనరావుపేట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారంలో వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల విలువైన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ఇతర సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చన్నారు. ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకువచ్చి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఇప్ప రాములు, అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్పీ విచారణ

చందుర్తి : కులంపేరుతో దూషించిన కేసులో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి మంగళవారం రాత్రి విచారణ చేపట్టారు. మండలంలోని రామన్నపేటకు చెందిన ముదగంపల్లి లక్ష్మీని ఇదే గ్రామానికి చెందిన చింతం దేవయ్యతో పాటు మరో తొమ్మిది కలిసి కులం పేరుతో దూషించారని ఈనెల 3న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఎస్సై శ్రీకాంత్ కేసునమోదు చేయగా దీనిపై ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి గ్రామంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పేద దళితుల భూములు ఇప్పించాలి

సిరిసిల్లఅర్బన్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో దళితులకు సంబంధించి సుమారు 10 వేల ఎకరాల భూములను లాక్కుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జ వేణు ఆరోపించారు. మంగళవారం వారు మాట్లాడుతూ, సిరిసిల్ల మిడ్ మానేరుకు కట్టకు ఆనుకొని ఉన్న 120 ఎకరాల పేదల భూములు బలవంతంగా గుంజుకొని వారిని రోడ్డున పడేసిందని మండిపడ్డారు. వేములవాడ మండలం నాంపల్లి గ్రామంలో 150 ఎకరాలు లాక్కొని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి వాడుకుందని, మర్రిపల్లిలో 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం పట్టాలిస్తే అందులో దళితులు ఆవులను సాకుతూ జీవిస్తుండగా ధరణి వచ్చి వారి భూములను వారికి కాకుండా చేసిందన్నారు. సదరు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేద దళితులకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

• 25న కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీలు

సిరిసిల్ల కల్చరల్: ఆల్ స్టైల్ కుంగ్‌ఫూ యూనిట్ ఆఫ్ తెలంగాణ మాస్టర్స్ వారి ఆధ్వర్యంలో ఈనెల 25న చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తునట్లు ఆ సంఘం ప్రతినిధి వడ్నాల శ్రీనివాస్ తెలిపారు. సంబంధిత పోస్టర్లను మంగళవారం పట్టణంలో ఆవిష్కరించారు. కరీంనగర్ రెవెన్యు గార్డెన్‌లో జరిగే పోటీల్లో 12 జిల్లాల నుంచి సుమారు 500 మంది పాల్గొంటారన్నారు. జిల్లానుంచి ఆసక్తి గల క్రీడాకారులు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నాలని కో రారు. సీనియర్ మాస్టర్ మామిడాల సమ్మయ్య , ఎండి సమీనా,గగ్గూరి దివ్య,విక్రమ్ గాంధీ ,బాలరాజు,పెద్దిరాజు రామకృష్ణ పాల్గొన్నారు.

• ఆరు మండలాల్లో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని ఆరు మండలాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. రుద్రంగిలో 3.1 మిల్లీమీటర్లు, వేములవాడ 2.9, ఎల్లారెడ్డిపేట 2.5, గంభీరావుపేట 1.2, వేములవాడ రూరల్ 0.9, ఇల్లంతకుంటలో 0.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో పెద్దగా వర్షం పడలేదు.

• విద్యావలంటీర్లను నియమించాలి

గంభీరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు ఎర్ర ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు శంకర్, రాజేశ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

• కలెక్టర్‌కు ఫిర్యాదు

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని స్వర్ణిమ సమైక్యకు సంబంధించి స్త్రీనిధి లోన్‌లో సుమారు రూ.7 లక్షలు ఆర్‌పీ తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు పెరుమాండ్ల వనజ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు డబ్బులను సభ్యులకు ఇవ్వడం లేదని, ఎవరైనా అడిగితే దుర్భాషలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్త్రీనిధి మేనేజర్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ కోసం వెళ్లిన అతడిని సైతం తిట్టినట్లు పేర్కొన్నారు. అలాగే మహిళా సంఘాలకు లోన్‌లు వస్తే ప్రతి ఒక్కరి నుంచి రూ.1,500, స్త్రీనిధి లోన్ నుంచి రూ.1,000 తీసుకుంటుందని, సమగ్ర విచారణ జరిపి మహిళా సంఘాలకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

• కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

సిరిసిల్ల కల్చరల్: కోర్టు ఉత్తర్వులు లెక్కచేయకుండా కక్షిదారులపైనే కేసులు పెడుతున్న పోలీసుల తీరును నిరసిస్తూ న్యాయవాదులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ద్విచక్రవాహనాలపై నిరసన ర్యాలీ నిర్వహించారు.

• ఆరోపణలపై చర్చకు రావాలి

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు తమపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ నాయకులు కోల కృష్ణ, చీకోటి మహేశ్ డిమాండ్ చేశారు. పోతుగల్‌లో విలేకరులతో మాట్లాడారు. పోతుగల్‌లో గ్యాస్ వినియోగదారుల వద్ద నుంచి ఇన్సూరెన్స్ పేరిట వసూళ్లు చేస్తున్నారనే విషయంపై ఆందోళన చేపట్టామని, దీంతో వినియోగదారుల డబ్బులు తిరిగి చెల్లించారని పేర్కొన్నారు. ఈ విషయంలో డీఎస్‌వోకు తాము ఫిర్యాదు చేయగా, ఫిర్యాదును వాపస్ తీసుకున్న తోట ధర్మేందర్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధర్మేందర్ ఫిర్యాదు చేయనప్పటికీ ఎలా ఫిర్యాదును వాపస్ తీసుకున్నారో చెప్పాలన్నారు. తాము అవినీతికి పాల్పడినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. శ్రీనివాస్‌గౌడ్, నానీ, తిరుపతి తదితరులున్నారు.

అంజన్న సేవలో కలెక్టర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ ఆంజనేయస్వామిని మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

• రౌడీ షీటర్ రిమాండ్

తంగళ్లపల్లి : కందికట్కూర్‌కు చెందిన రౌడీ షీటర్ భూపతి వెంకటేశ్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. వెంకటేశ్ భూ వివాద విషయమై గత నెలలో కందికట్కూర్‌కే చెందిన పైడి రేవతిపై పారతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె తలకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వెంకటేశ్‌పై ఇప్పటికే 6 కేసులున్నాయని తెలిపారు.

• ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట: పదిర మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన అల్లెపు శ్రీనివాస్ తన వాహనంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు రాచర్ల బొప్పాపూర్ శివారులో వాహనాన్ని తనిఖీ చేసి సీజ్‌చేశారు. అనంతరం వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించా రు. శ్రీనివాస్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలి పారు.

• ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జూన్, జూలై నెలలో జీతాలు రాలేదని వాపోయారు 11 ఏళ్లుగా ఒకే పాఠశాలలో పనిచేస్తుండగా బదిలీ చేయాలన్నారు. ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

• 25 మందికి జరిమానా

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బహిరంగంగా మద్యంతాగడం, మద్యంతాగి వాహనాలు నడిపిన 25 మందికి మంగళవారం కోర్టులో జరిమానా విధించినట్లు తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగిన 19 మందికి రూ.22,500, మద్యంతాగి వాహనాలు నడిపిన ఆరుగురికి రూ.1260 జరిమానాలు విధిస్తూ జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఉదయశ్రీ తీర్పు వెల్లడించిరట్లు ఎస్సై పేర్కొన్నారు.

• చెరువు పరిశీలన

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంగళవారం నేషనల్ గ్రీన్ కాప్స్ నిర్వహించి గ్రామ చెరువును ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పరిశీలించారు.నీటి వనరులు ఆవశ్యకత, మురుగునీటి వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు. ఎంపీవో మీర్జా బేగ్, హెచ్‌ఎం బండి ఉపేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్, ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

• ఎరువుల బస్తాల కోసం నిరీక్షణ

చందుర్తి: ఎరువుల బస్తాల కోసం సనుగుల సొసైటీ కార్యాలయానికి రాగా సిబ్బంది ఎరువుల బస్తాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన సంతోష్ అనే రైతు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశాడు. వరి నాట్లు వేసేందుకు ఎరువుల బస్తాల కోసం వస్తున్నట్లు సిబ్బందికి సమాచారం ఇచ్చి సొసైటీ కార్యాలయానికి వచ్చానని , సిబ్బంది ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తమను సొసైటీ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ బాధిత రైతు వాట్సాప్ గ్రూపుల్లో ఓ వీడియోను పోస్ట్‌చేశాడు. కాగా సనుగుల సీఈవో శ్రీ వర్ధన్‌ను వివరణ కోరగా సొసైటీ సిబ్బంది రుణమాఫీ ఫైల్‌ను సిద్ధం చేసే పనుల్లో బిజీగా ఉన్నామని, కా ర్యాలయంలో పనిచేసే అనిల్ కిష్టంపేటలో రైతులకు ఎరువుల బస్తాలను విక్రయించేందుకు వెళ్లారన్నారు.





గంభీరావుపేటలోని దోసల గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీని రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చేశారు. తర్వాత ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో కుక్కలు, కోతులు, పందులు పాఠశాలలోకి రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వర్షపు నీరంతా పాఠశాల ముందు చేరుతుండటంతో నడిచేందుకు వీల్లేకుండా ఉంది. అధికారులు సమస్యలను పరిష్కరించాలి. - దోసల శంకర్, దోసలగూడెం, గంభీరావుపేట

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048

వర్గీకరణ విజయం అమరులకు అంకితం



నినాదాలు చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రక విజయమని, ఈ విజయం అమరులకు అంకితమని మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తీర్పును స్వాగతిస్తూ మంగళవారం మండలకేంద్రంలో స్వీట్లు పంపిణీ చేశారు. వర్గీకరణ పోరాటం న్యాయమైందని, సుప్రీంకోర్టు తీర్పును గుర్తించి మాదిగల అభివృద్ధికి బాటలు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రాము, దేవయ్య, నర్సింలు, శ్రీమన్, లక్ష్మణ్, భాస్కర్, రాములు, దుర్గాప్రసాద్, సతీశ్, బాబు, దిలీప్, రాజశేఖర్, కల్యాణ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగింది. రాజన్న వసతి గదుల సమాచారం ఇలా ఉంది.

కాంప్లెక్స్ పేరు	మొత్తం	ఖాళీలు
అమ్మవారి కాంప్లెక్స్	08	0
భీమేశ్వర సదన్ ఏసీ	56	0
భీమేశ్వర సదన్ సూట్స్	04	0
భీమేశ్వర గెస్ట్‌హౌస్	05	0
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	55	0
నందీశ్వర్ నాన్ఏసీ	112	60
నందీశ్వర సూట్స్	08	06
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	94	45
పార్వతీపురం స్పెషల్	56	30
పార్వతీపురం సాధారణ	54	36

- వేములవాడ

నేతన్న కుమారుడికి సర్కారు కొలువు

సిరిసిల్ల: సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో ఓ పేదింటి యువకుడు ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా, ఉద్యోగం సాధించాడు. తండ్రి పవర్‌లూమ్ కార్మికుడు కాగా తల్లి బీడీ కార్మికురాలు. అయినా, చదువుకు, ఉద్యోగాల సాధనకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మామిడాల సమ్మయ్య-శ్యామల దంపతులకు ఇద్దరు కుమారులు సాయికార్తీక్, పవన్‌కల్యాణ్ ఉన్నారు. ఇద్దరూ ఐదో తరగతి వరకు గీతానగర్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. ఆరు నుంచి పదోతరగతి వరకు గీతానగర్ బాలిక హైస్కూల్‌లో చదువుకున్నారు. పాలిసెట్‌లో ర్యాంకులు సాధించి అగ్రహారం పాలిటెక్నిక్‌లో సాయి కార్తీక్ సివిల్, పవన్‌కల్యాణ్ ఎలక్ట్రికల్ డిప్లొమా చేశారు. ఇద్దరూ ఈసెట్ ద్వారా మంచి ర్యాంకులు సాధించి వరంగల్ కిట్స్‌లో ఉచితంగా సీట్లు సాధించి బీటెక్ పూర్తిచేశారు. సాయికార్తీక్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తిచేశాడు. 2023లో జరిగిన ఇంజినీరింగ్ పరీక్షల్లో 79వ ర్యాంకు సాధించి ఏఈఈగా ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం సాధించాడు. గ్రూప్-1లోనూ ప్రిలిమ్స్ పాసై మెయిన్స్‌కు సిద్ధమవుతున్నారు. మరోవైపు గ్రూప్-4లోనూ రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించారు. మూడు ఉద్యోగాలు సాయికార్తీక్ ముంగిట ఉన్నాయి. ప్రస్తుతం ఏఈఈగా ఎంపిక కావడం విశేషం. పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ప్రైవేటు సాఫ్ట్‌వేర్ కంపెనీలో మెరుగైన ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాడు.

ఆనందంగా ఉంది



ఎలాంటి కోచింగ్ లేకుండానే మూడు ఉద్యోగాలకు అర్హత సాధించాను. ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా గెజిటెట్ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. సొంతగానే టెక్స్ట్ బుక్స్ చదువుకొని ప్రిపేరయ్యా. గ్రూప్-1 మెయిన్స్ కోసం ప్రిపేర్ అవుతున్నా. నాకు ఉద్యోగం రావడం పట్ల మా ఇంట్లో చాలా సంతోషంగా ఉన్నారు.

- మామిడాల సాయికార్తీక్, ఏఈఈ

స్వచ్ఛదనం - పచ్చదనంలో భాగస్వాములవ్వాలి



వేములవాడఅర్బన్: వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముస్తాబాద్: స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీవో బీరయ్య అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా మండలంలో ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను శుభ్రం చేయించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించామని, రక్షిత నీటిని సరఫరా చేసేందుకు క్లోరినేషన్ చేశామన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం , ఉపాధ్యాయులు రవీందర్, హమీద్ ఉన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు మద్దిమల్ల, బంజేరు, మద్దిమల్ల తండా గ్రామాలను మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు పరిశీలించారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే ప్రజలకు నీటిని సరఫరా చేయాలని, శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మద్దిమల్ల తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి పిచ్చిమొక్కలు తొలగించారు. ఆర్‌ఐ ప్రవీణ్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనరావుపేట: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. పిచ్చిమొక్కలు ఉన్న చోట మందులు పిచికారీ చేశారు.

ఆర్డీవో పరిశీలన

మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాలను సిరిసిల్ల ఆర్డీవో, తంగళ్లపల్లి స్పెషల్ అధికారి ఎల్.రమేశ్ పరిశీలించారు. పాపయ్యపల్లె, తాడూర్‌లో పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు కవిత, రాజు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: . స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్ బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, పరుశరాములు, శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పొలంలోకి దూసుకెళ్లిన కారు

రుద్రంగి: మండల కేంద్రంలోని జారుడు బండ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి పంట పొలంలోకి దూసుకెళ్లి బోర్లా పడింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఉండగా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.